క్లుప్తంగా

జెడ్పీ సీఈవోను కలిసిన ఉద్యోగులు



జెడ్పీసీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

జగిత్యాలజోన్: తమ సమస్యల పరిష్కారం కోసం జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డిని జిల్లాలోని పంచాయతీరాజ్ ఉద్యోగులు శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్ట్‌ల సీనియార్టీ జాబితాలో వీఆర్వో, వీఆర్ఏలను చేర్చడం వల్ల సీనియర్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఉద్యోగ సంఘాల నాయకులు విన్నవించారు.

కాంగ్రెస్ పాలనలోనే కరువు



ఉప్పుకుంటను పరిశీలిస్తున్న దావ వసంత

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ పాలనలో కరువు తలపిస్తోందని జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లిలో ఎండిపోయిన ఉప్పుకుంట చెరువును శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో మండుటెండల్లో కూడా చెరువులు మత్తళ్లు దూకాయని, కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోయి రైతులు ఆందోళనకు చెందుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. 200 ఎకారల్లో పొలాలు పొట్టదశలో ఎండిపోతున్నాయని, వెంటనే పొలాలకు నీరు అందించాలని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరావు, కమలాకర్‌రావు, రాజు, తిరుపతి, మహేశ్, గంగారెడ్డి, పాల్గొన్నారు.

పసుపు రైతుల ధర్నా విజయవంతం చేయాలి



రైతులను కలిసిన ఐక్యవేదిక నాయకులు

మెట్‌పల్లిరూరల్: ఈ నెల 11న మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించే పసుపు రైతుల ధర్నాను విజయవంతం చేయాలని రైతు ఐక్య వేదిక నాయకులు కోరారు. మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్,రామలచ్చక్కపేట,ఆత్మకూర్ గ్రామాల్లో రైతులను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ధర్నాకు ప్రతి ఒక్కరు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో రైతు ఐక్యవేదిక నాయకులు తిరుపతిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి,కర్ణాకర్‌రెడ్డి, సాయిరెడ్డి, అంజిరెడ్డి, సురేశ్, తిరుపతి, నరేశ్,సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనివాస్

జగిత్యాలఅగ్రికల్చర్: విద్యుత్ కాంట్రాక్టర్లు నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని విద్యుత్ శాఖ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యుత్ పనులు నిర్వహించేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సాల్యానాయక్, డీఈ గంగారాం, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం

సారంగాపూర్:చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తామని నీటిపారుదలశాఖ ఈఈ నారాయణరెడ్డి, డీఈ చక్రూనాయక్, భాస్కర్ అన్నారు. మండలంలోని సారంగాపూర్, పోతారం, బట్టపల్లి గ్రామాల్లో శుక్రవారం పంట పొలాలను పరిశీలించారు. సాగునీరందడం లేదనే ఫిర్యాదు మేరకు రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎండిపోతున్న పంటలను రైతులు చూపించారు. నీటిని విడుదల చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఏఈ ప్రణయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మోహన్, ఏఈవో వెంకటేశ్, లస్కర్లు, రైతులు ఉన్నారు.



పోలేరమ్మ ఆలయంలో కుంకుమ పూజ

మెట్‌పల్లి: పట్టణంలోని పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు రామకృష్ణ మహిళల చేత కుంకుమపూజ జరిపించారు. ప్రతీ శుక్రవారం ఆలయంలో కుంకుమపూజ ఉంటుందని, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వంగల రమ్య, గాలిపెల్లి దివ్యవాణి, ఉప్పుల రూప, తదితరులు పాల్గొన్నారు.



శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్యాల: మండల కేంద్రంలోని రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం అమ్మవారిని సహస్ర నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి దీక్షలు చేపట్టిన దీక్షాపరులు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయంలో ఆదివారం హోమం నిర్వహించనున్నట్లు గౌడ సంఘం అధ్యక్షుడు పొన్నం శ్రీనివాస్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

11నుంచి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ శివారులోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 11 నుంచి 19 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.దీని కోసం ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈనెల 11న సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు.

ముందస్తు మహిళా దినోత్సవం

రాయికల్/సారంగాపూర్/పెగడపల్లి/మేడిపల్లి/ఇబ్రహీంపట్నం/మల్యాల/వెల్గటూర్: మహిళా దినోత్సవ వేడుకలను శుక్ర వారం జిల్లా లోని పలు పాఠశాలల్లో ముందుస్తుగా జరుపుకున్నారు. బీర్‌పూర్ మండలం కొల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మేడిపల్లి మండలం కొండాపూర్ పాఠశాలలో, ఇబ్రహీంపట్నం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా టీచర్లను సన్మానించారు. పెగడపల్లిలో మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు. మల్యాలలో ఉపాధి హామీ కూలీలను ఎంపీడీవో స్వాతి కలిసి, మహిళా దినోత్సవం నిర్వహించుకున్నారు. వెల్గటూర్ మండలం పాశిగామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లులను సన్మానించారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాయికల్ మహిళా దినోత్సవ సంబరాలు



పెగడపల్లి: స్వీట్లు పంచుకుంటున్న మహిళా ఉద్యోగులు



ఇబ్రహీంపట్నంలో టీచర్లకు విద్యార్థుల సన్మానం



పాశిగామలో విద్యార్థుల తల్లులకు సన్మానం

దుండగులను కఠినంగా శిక్షించాలి



జగిత్యాల తహసీల్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దళిత నాయకులు

జగిత్యాలటౌన్: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు దుమాల గంగారాం మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: సారంగాపూర్ మండలం నగునూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులదండ వేసి అవమానపర్చిన వ్యక్తిని గుర్తించి కఠినంగా శిక్షించాలని మండల దళిత, అంబేడ్కర్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం ఆయా సంఘాల నాయకులు సంఘటనను వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీరాజం, భూమేశ్, మహేందర్, అంజయ్య, బాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని నాగునూర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సంఘాల నాయకులు తహసీల్దార్ జమీర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు బిరుదల లక్ష్మణ్, డిక్కీ జిల్లా కోఆర్డినేటర్ నల్ల శ్యామ్, న్యాయవాదులు,నాయకులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది వేతనాలను చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్మికులు

సారంగాపూర్: గ్రామపంచాయతీ సిబ్బందికి వేతనాలను సకాలంలో చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శుక్రవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల ఎంపీడీవోలు గంగాధర్, లచ్చాలుకు పంచాయతీ సిబ్బంది వినతిపత్రాలను అందజేశారు. ఎస్‌టీవోల్లో నిలిచిపోయిన బకాయిలను విడుదల చేయాలని, గ్రామపంచాయతీలపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని వారు కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మల్యాల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కార్మికులు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట తమ హక్కుల సాధన కోసం ధర్నా చేసి, అనంతరం ఎంపీడీవో స్వాతికి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని నినాదాలు చేశారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండలాధ్యక్షుడు కోరెపు మల్లేశం, ఉప్పరి రవి, దప్పు రవి, గసిగంటి శ్రీనివాస్, మ్యాక దేవమ్మ, పాడేటి నర్సవ్వ, కోరెపు నర్సయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీనివాసరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాస్‌రెడ్డి పెగడపెల్లి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డికి అదనపు బాధ్యతలను అప్పగించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పదవీ విరమణ పొందుతున్న టీచర్లను సన్మానిస్తున్న నాయకులు

జగిత్యాల: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సాధికారత సాధ్యమవుతుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు అన్నారు. శుక్రవారం పీఆర్టీయూ జగిత్యాల జిల్లా శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలకు అన్ని హక్కులున్నాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మోతె జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ శశికళ, మెట్‌పల్లి స్కూల్ అసిస్టెంట్ జయప్రద పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వసంత, చందన, అనూజ, ప్రశాంతి, శ్రీదేవి, పద్మ, సునీత, సరోజన, తరంగిణి, నాగరాణి, శ్రీలత, రచన, రజిని, మహేశ్ పాల్గొన్నారు.

షోకాజ్ నోటీస్ అందుకున్న అధికారులకు ఉపశమనం

జగిత్యాల: ఇంటర్మీడియేట్ ప్రశ్నపత్రాలు, సమాధానపత్రాలు తరలింపులో నిర్లక్ష్యంపై గురువారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరీక్షల నిర్వహణ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీంతో జిల్లా గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 ఆధ్వర్యంలో ఇంటర్‌బోర్డు కార్యదర్శికి షోకాజ్ వినతిపత్రం అందజేశారు. బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, నోడల్ అధికారి నారాయణతో మాట్లాడి సమస్య వివరించడంతో ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొట్టాల తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అందుబాటులో యూరియా

ఇబ్రహీంపట్నం: రైతులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా అందుబాటులో ఉందని, మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం, యామాపూర్, తిమ్మాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో యూరియా నిలువలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో వినోద్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో ఇసుక డంపులను అధికారులు సీజ్ చేశారు. గ్రామ శివారులోని కొండస్వామి ఆలయ ప్రాంతంలో ఓ చోట ఇసుక డంపులు ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ బృందానికి సమాచారంతో శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్లిన అధికారులు 10 ట్రాక్టర్ల ఇసుక డంపులు గుర్తించి సీజ్ చేశారు. ఆత్మనగర్ శివారులోని గుట్ట ప్రాంతంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రామలచ్చక్కపేట వద్ద పట్టుకుని ట్రాక్టర్ యాజమాని శేఖర్‌కు రూ.25 వేలు జరిమానా విధించారు.

టీఆర్‌నగర్‌లో అగ్నిప్రమాదం

జగిత్యాలరూరల్: పట్టణ శివారులోని టీఆర్‌నగర్‌లోని ఓ ఇంట్లో వంట చేస్తుండగా సిలిండర్ పేలి మంటలు అంటుకున్నాయి. మదర్సాలో విద్యార్థుల కోసం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో చేరుకుని మంటలు ఆర్పేసి పెను ప్రమాదాన్ని నివారించారు. అగ్నిప్రమాదంలో సుమారు రూ.50 వేల నష్టం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

బుగ్గారం: మండలంలోని మద్దునూర్ శివారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మాడ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గ్రామశివారులోని పల్లె ప్రకృతివనం సమీపంలో తన సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు 50 గ్రాముల గంజాయితో మోటార్ బైక్‌పై వెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

రాయికల్: పట్టణంలో ఫిబ్రవరి 27న ఆశా కార్యకర్తపై జరిగిన అత్యాచారం కేసులో శుక్రవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు రాయికల్‌కు చెందిన మక్కల రాజుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం

వెల్గటూర్ : పీఆర్‌టీయూ కార్యవర్గంలో పలువురిని నియమించినట్లు సంఘ అధ్యక్ష కార్యదర్శులు బోయినిపల్లి ఆనందరావు, యాల్ల అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా మామిడి సంతోష్, జిల్లా కార్యదర్శులుగా బైరిశెట్టి ధర్మేందర్, రామోజి సంతోష్, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జగన్నాథరావు లను నియమించినట్లు తెలిపారు. తమ నియమకానికి సహకరించిన జిల్లా అధ్యక్ష కార్యదర్శులకు, నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా శుక్రవారం పోలీస్‌స్టేషన్, మెట్‌పల్లిలోని అగ్నిమాపక కేంద్రం, ఎచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులను సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు ఏ విధంగా పనిచేస్తారు, స్టేషన్‌లో లాకర్ గది, రికార్డుల గది మొదలైనవి చూపించి అవగాహన కల్పించారు. బ్యాంకు సేవలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అచ్చ విజయభాస్కర్, ఉపాధ్యాయులు రమేశ్, నవత, బోదమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీ లెక్కింపు

కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన శ్రీ వేంకటేశ్వర ఆలయం, బస్టాండ్ రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో శుక్రవారం హుండీ లెక్కించారు. శ్రీ వేంకటేశ్వర ఆలయ హుండీలో రూ. 55,039 నగదు, అంజనేయ స్వామి ఆలయ హుండీలో రూ.1,07,290 నగదు సమకూరినట్లు దేవాదాయ శాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమొగిలి తెలిపారు. కార్యక్రమంలో ఈవో విక్రమ్, నర్సయ్య, పూజారులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

సారంగాపూర్: జిల్లా కలెక్టర్ జైయీభవ విజయీభవ కార్యక్రమం కింద పదో తరగతి విద్యార్థుల కోసం చేపట్టిన ఐదు సూత్రాలను విద్యార్థులు పాటించాలనిఎంఈవో నాగభూషణం అన్నారు. బీర్‌పూర్ మండలం తుంగూర్ ఉన్నత పాఠశాలలోశుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. పదో తరగతి విద్యార్థులు ఈ సూత్రాలను పాటిస్తే సత్ఫలితాలను సాధించవచ్చని అన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్న పత్రాలు

ఇబ్రహీంపట్నం: ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రాలు శుక్రవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. ప్రశ్నపత్రాలను ప్రత్యేక బాక్సుల్లో పెట్టి ఉపాధ్యాయులు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు.

మదర్సాలో అగ్నిప్రమాదం

జగిత్యాలరూరల్: పట్టణ శివారులోని టీఆర్‌నగర్‌లోని మదర్సా నిర్వహిస్తున్న ఇంట్లో సిలిండర్ పేలి మంటలు అంటుకున్నాయి. మదర్సాలో విద్యార్థుల కోసం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో చేరుకుని మంటలు ఆర్పేసి పెను ప్రమాదాన్ని నివారించారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.50 వేల నష్టం జరిగినట్లు మదర్సా నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

మల్యాల: మండలంలోని మల్యాల, తక్కళ్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల, గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ దయానంద్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీశ్ తెలిపారు.

పీహెచ్‌సీలో జన ఔషధి దివస్

సారంగాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జన ఔషధి దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రాధారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ జన ఔషధి కేంద్రాల్లో పేద వారికి అందుబాటు ధరల్లో నాణ్యత ప్రమాణాలతో తయారైన మందులు లభ్యమవుతాయని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ దామోదర్, సూపర్‌వైజర్ కిశోర్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో ఫ్రెషర్స్‌డే



వేడుకలకు హాజరైన జడ్జి నీలిమ

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా జడ్జి నీలిమ మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యం కోసం కృషి చేయాలని కోరారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనస్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీలత, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారాయణ్‌భట్, విద్యార్థినులు పాల్గొన్నారు.



జగిత్యాలటౌన్: జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయం ప్రైవేట్ వాహనాల పార్కింగ్ అడ్డాగా మారింది. జిల్లా కేంద్రంలోని రూరల్ మండల పరిషత్ కార్యాలయానికి గేటు లేకపోవడంతో రాత్రి పగలు అనే తేడా లేకుండా ప్రైవేట్ వ్యక్తులు కార్యాలయ ఆవరణలో సంచరిస్తున్నారు. భద్రత కరువైందనే చర్చ సాగుతోంది. ఇటీవల స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దొంగలు చొరబడేందుకు యత్నించిన నేపథ్యంలో అధికారులు స్పందించి కార్యాలయానికి గేటు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రమాదేవి, ఎండీడీవో, జగిత్యాలరూరల్, సెల్ నం.: 9281481651